www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 30 | 5-7-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



# అప్పుల్లో రాష్ట్రం



## ఫామ్‌హౌస్‌లు, పదవులు వాళ్ల కుటుంబానికే

- 8.50 లక్షల కోట్ల అప్పులు.. పేదలకు కేసీఆర్ చేసిందేమీ లేదు
- దళితుల ప్రాణాలకు విలువ లేదా?
- మళ్లీ ఆ దోపిడీ పాలన కావాలా
- మిడ్జిల్ అభివృద్ధికి భారీగా నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2పేజీలో..

జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి దాకా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం రేవంత్ రెడ్డి విపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కేసీఆర్ కుటుంబ సభ్యులు వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు ఎలా సంపాదించారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఇదే సభలో మిడ్జిల్ అభివృద్ధి కోసం 47.08 కోట్ల రూపాయల పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. గడిచిన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ సెలవు తీసుకోలేదని, వచ్చిన అవకాశాన్ని ఎన్నడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 3 ఎకరాల భూమి, కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా అని నిలదీశారు. మళ్లీ కేసీఆర్ కుటుంబ దోపిడీలు, దొంగతనాలు మొదలు కావడానికే ప్రజా పాలన పోవాలా అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## అరుదైన నాయకుడు రేవంత్!



- సీఎంకు ప్రత్యేక శుభాకాంక్షలు
- కొనియాడిన మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు

2

## టీఆర్ఎస్ పేరు మార్చబోం!

### అవసరమైతే న్యాయపోరాటం

- ఈసీకి కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ
- పార్టీ పేరు మార్చుకోవాలని నోటీసులు
- లేదంటే దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరిక

3





## కష్టపడి పైకి వచ్చిన కేసీఆర్, రేవంత్

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ అభినందనలు
- ఓట్లపై భారీ కుట్ర!.. మజ్లిస్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు
- హిందువులే మైనార్టీలయ్యే తీవ్ర ప్రమాదం

2

# గోబెల్స్ ప్రచారాలే!

- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- కాంగ్రెస్ అప్పులు మా ఖాతాలో వేస్తారా
- అప్పులపై డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు
- బీఆర్ఎస్ అప్పు 4.14 లక్షల కోట్లే
- 5.16 లక్షల కోట్ల అప్పు అవాస్తవం
- భట్టి విక్రమార్కపై హరీశ్ రావు ఫైర్



రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్న లెక్కలన్నీ పచ్చి అబద్ధాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు కేవలం 4.14 లక్షల కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ తెచ్చిన 15 వేల కోట్ల అప్పును కూడా తమ ఖాతాలో వేసి తప్పుడు లెక్కలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కోపంతో రంకెలు వేసినంత మాత్రాన వాస్తవ అంకెలు ఎన్నటికీ మారవని ఆయన ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## కుళ్లిపోయిన మాంసం, కల్తీ పేస్టులు

- 100 రోజుల్లో 185 కేసులు
- భారీగా కల్తీ పదార్థాల సీజ్
- హోటళ్లపై హెచ్ ఫాస్ట్ దాడులు
- ఫిర్యాదులకు సీపీ సజ్జనార్ పిలుపు

3

## నిర్లక్ష్యం చేస్తే వేటే!

- తక్కువ వర్షపాతంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలపై వెంటనే దృష్టిపెట్టాలి
- సీఎస్ సంజయ్ జాజు



వివరాలు 3లో..



## పనుల్లో వేగం పెంచండి

- ఓఆర్ఆర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు
- నియోజకవర్గానికి 500 ఇళ్లు కేటాయింపు
- మంత్రి పొంగులేటి

2

## నీలోఫర్‌లో దారుణ ఘటన!

- 6 రోజుల శిశువును ఆస్పత్రిలో చేర్చి పరారైన దంపతులు
- కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు

3





## భద్రకాళి వద్ద ఉద్రిక్తత!

3

## పార్లమెంట్ షెడ్యూల్ ఖరారు



- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

4



## బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ

4

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు.

4



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
5 జూలై 2026

# కష్టపడి పైకి వచ్చిన కేసీఆర్, రేవంత్

**సీఎం రేవంత్‌కు బండి సంజయ్ అభినందనలు**

**ఓట్లపై భారీ కుట్ర!.. మజ్లిస్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు**

**హిందువులే మైనార్టీలయ్యే తీవ్ర ప్రమాదం**



**హైదరాబాద్:** ప్రజా జీవితంలో 2 దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కష్టపడి పైకొచ్చిన వారేనని ఆయన ప్రశంసించారు. అయితే రాష్ట్రంలో ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లను ఏరివేసే భారీ కుట్ర చేస్తోందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా జీవితంలో 2 దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం మీడియాతో మాట్లాడుతూ ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ కూడా ఎంతో కష్టపడి పైకి వచ్చినవారే అని ఆయన కొనియాడారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### మజ్లిస్‌తో కుమ్మక్కై..

రాష్ట్రంలో ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుట్ర చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. మజ్లిస్ పార్టీతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా హిందువుల ఓట్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఇదే జరిగితే తెలంగాణలో త్వరలోనే హిందువులే మైనార్టీలుగా మారే తీవ్ర ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని కేంద్ర మంత్రి విమర్శించారు.

# పనుల్లో వేగం పెంచండి!

**అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం**

**ఓఆర్ఆర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు**

**నియోజకవర్గానికి 500 ఇళ్లు కేటాయింపు**

**త్వరలో ఖరారు కానున్న టెండర్లు**

**రెవెన్యూ శాఖకు అత్యాధునిక శాశ్వత భవనాలు**



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒకే మోడల్‌లో శాశ్వత భవనాల నిర్మాణంపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చే సంకల్పంతో గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం అయిందన్నారు. ఇదే స్ఫూర్తిని ఓఆర్ఆర్ పరిధిలో చేపట్టబోయే పట్టణ పేదల గృహ నిర్మాణాల్లోనూ చూపించాలన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు రెవెన్యూ, గృహ నిర్మాణ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖరారైన స్థలాల్లో వెంటనే పనులు మొదలుపెట్టాలని, స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వీటికి సంబంధించిన టెండర్లను త్వరలోనే ఖరారు చేస్తామని తెలిపారు.

### ఒకే మోడల్‌లో రిజిస్ట్రార్ కార్యాలయాలు..

రాష్ట్ర వ్యాప్తంగా 10 ఆర్డీఓ, 107 తహసీల్దార్, 2 డీఐజీ, 4 జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్, నమూనాలో అత్యాధునిక సదుపాయాలతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్, పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ కార్యదర్శి వీపీ గౌతమ్, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల్లో రాష్ట్రం

- ఫామ్‌హౌస్‌లు, పదవులు వాళ్ల కుటుంబానికే
- 8.50 లక్షల కోట్ల అప్పులు.. పేదలకు కేసీఆర్ చేసిందేమీ లేదు
- దళితుల ప్రాణాలకు విలువ లేదా?
- మళ్లీ ఆ దోపిడీ పాలన కావాలా
- మిడ్జిల్ అభివృద్ధికి భారీగా నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**మహబూబ్‌నగర్:** జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి దాకా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం రేవంత్ రెడ్డి విపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కేసీఆర్ కుటుంబ సభ్యులు వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు ఎలా సంపాదించారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఇదే సభలో మిడ్జిల్ అభివృద్ధి కోసం 47.08 కోట్ల రూపాయల పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. గడిచిన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ సెలవు తీసుకోలేదని, వచ్చిన అవకాశాన్ని ఎన్నడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పాలకుల దోపిడీపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. 70 వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. దళితులను లారీలతో తొక్కించి చంపారని, పదేళ్లు కేవలం కేసీఆర్ కుటుంబానికి, బంధువులకు తప్ప ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని, కేటీఆర్, కవిత, హరీశ్ రావులకు వేల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 3 ఎకరాల భూమి, కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా అని నిలదీశారు. మళ్లీ కేసీఆర్ కుటుంబ దోపిడీలు, దొంగతనాలు మొదలు కావడానికే ప్రజా పాలన పోవాలా అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

### 47.08 కోట్లతో అభివృద్ధి పనులు..

వెనుకబడిన మిడ్జిల్‌ను దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇక్కడి ప్రజలు ఆనాడు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై తనకు సర్వం ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులతో కలిసి 47.08 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో 10 కోట్లతో ఉరుకొండపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి, 20 కోట్లతో పాత మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీల (మిడ్జిల్‌లో 24, ఉరుకొండలో 16) అభివృద్ధి పనులు ఉన్నాయి. అలాగే 17.08 కోట్లతో భైరాంపల్లి దగ్గర దుంధుబి వాగు, వడియాల్ సమీపంలోని చిన్న వాగు, వస్పుల కత్వా పునరుద్ధరణ వంటి చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

### విగ్రహాల ఆవిష్కరణ.. ఆత్మీయ సమ్మేళనం..

మిడ్జిల్ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్థానిక సీనియర్ నాయకుడు ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. 40 ఏళ్లుగా నానుతున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణను పరిష్కరించామని, 100 ఏళ్లుగా జరగని బీసీ కులగణనను తమ ప్రభుత్వమే చేపట్టిందని ఆయన గుర్తుచేశారు. ఈ జిల్లా బిడ్డ బూర్గుల రామకృష్ణారావు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని, జైపాల్ రెడ్డి, మహేంద్రనాథ్ లాంటి గొప్ప నాయకులున్న ప్రాంతం ఇదని కొనియాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు ఉరుకొండపేటలోని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 2006 నాటి పాత మిత్రులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అరుదైన నాయకుడు రేవంత్!

- సీఎంకు మంత్రుల ప్రత్యేక శుభాకాంక్షలు
- అంచెలంచెలుగా ఎదిగిన ప్రజా నాయకుడు
- లక్ష్యం కోసమే ఆయన పోరాటం
- దీక్షకు నిదర్శనం ఈ ప్రస్థానం
- కొనియాడిన మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు



**హైదరాబాద్:** మిడ్జిల్ జడ్పీటీసీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రజా జీవితంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆయనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డిని పలువురు మంత్రులు స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా..

పాలమూరు జిల్లా నుంచి జడ్పీటీసీగా గెలిచి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆనాడు తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు సీఎం స్వయంగా వారి ముందుకు వెళ్లారని గుర్తుచేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడే గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అని ఆయన ప్రశంసించారు. జడ్పీటీసీ స్థాయి నుంచి సీఎం వరకు విజయవంతంగా ప్రయాణించిన ఆయన.. ప్రజాసేవలో మరెన్నో విజయాలు సాధించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

### గొప్ప సంకల్పానికి నిదర్శనం..

2006 లో స్వతంత్ర జడ్పీటీసీగా గెలిచి అంచెలంచెలుగా ఎదిగిన సీఎం ప్రస్థానం ఆయన అంకితభావం, నిబద్ధతకు నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గొప్ప సంకల్పం ఉంటే ఏదైనా సాధించొచ్చు అనడానికి సీఎం జీవితమే ఉదాహరణ అని ఆయన చెప్పారు. 2 దశాబ్దాలుగా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి మనందరం అండగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. తెలంగాణకు పట్టిన చీడను విడిపించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ఆయనకు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందని శ్రీహరి స్పష్టం చేశారు.

# నిర్లక్ష్యం చేస్తే వేటే!

- తక్కువ వర్షపాతంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలపై వెంటనే దృష్టిపెట్టాలి
- ఆహార భద్రతలో రాజీ పడొద్దు
- కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు
- సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్:** రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులతో వివిధ శాఖల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార భద్రత కట్టుదిట్టమైన అమలుపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మరో కీలక సమీక్ష జరిపారు. తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై ఆయన సమీక్షించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, ప్రత్యామ్నాయ పంటలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు.

### ఆహార భద్రతపై కఠిన చర్యలు..

రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు. డ్రగ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 2 విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను 1 వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, ఎన్ శ్రీధర్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, వైద్య శాఖ కమిషనర్ సంగీత, డ్రగ్ కంట్రోలర్ డీజీ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# టీఆర్ఎస్ పేరు మార్చబోం!

- అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం
- ఈసీకి కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ
- పార్టీ పేరు మార్చుకోవాలని నోటీసులు
- లేదంటే దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరిక
- ఇప్పటికే ఈసీకి న్యాయపరమైన సమాధానాలు



**హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇచ్చిన నోటీసులపై ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. పార్టీ పేరు మార్చుకునే ప్రసక్తే లేదని, ప్రత్యామ్నాయ పేర్లు ఇచ్చేది లేదని ఆమె తేల్చిచెప్పారు. టీఆర్ఎస్ పేరుకే తాము కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే.. సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని కవిత కుండబద్దలు కొట్టారు. కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఈసీ పేర్కొంది. 15 రోజుల్లో 3 ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీలులేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది.

### పేరు మార్చే ప్రసక్తే లేదు..

ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన 2 అభ్యంతరాలకు న్యాయపరమైన సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికి సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై ఈసీ పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన 2 ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టీఆర్ఎస్' మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు.

### సుప్రీంకోర్టుకు వెళతాం..

కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టీఆర్ఎస్' పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నాయకత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే సాంకేతిక, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# గోబెల్స్ ప్రచారాలే!

- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- కాంగ్రెస్ అప్పులు మా ఖాతాలో వేస్తారా
- అప్పులపై డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు
- భట్టి విక్రమార్కపై హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్:** రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్న లెక్కలన్నీ పచ్చి అబద్ధాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు కేవలం 4.14 లక్షల కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ తెచ్చిన 15 వేల కోట్ల అప్పును కూడా తమ ఖాతాలో వేసి తప్పుడు లెక్కలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కోపంతో రంకెలు వేసినంత మాత్రాన వాస్తవ అంకెలు ఎన్నటికీ మారవని ఆయన ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు 4.14 లక్షల కోట్లు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని, నిధులు లేవని ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదని ఆయన గుర్తుచేశారు.

### కొత్త డ్రామాలకు తెర..

రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. అందులో భాగమే ఇప్పుడు డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులు వెతుకుతున్నారని దుయ్యబట్టారు.

### కాలయాపన చేస్తున్నారు..

ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారని, తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో చేస్తామని ఆనాడు బాండ్లు రాసిచ్చిన నేతలు ఇప్పుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారవని, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

# నీలోఫర్‌లో దారుణ ఘటన!

### 6 రోజుల శిశువును ఆస్పత్రిలో చేర్చి పరారైన దంపతులు
### కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు..
### శిశు విహార్‌కు బాబు తరలింపు



**హైదరాబాద్:** కన్న పేగు కఠినమైంది. అనారోగ్యంతో బాధపడుతున్న 6 రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిన దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. శ్వాసకోశ సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ మగ శిశువును వైద్యులు ఎంతో బాధ్యతగా వ్యవహరించి కాపాడారు. ఒడిశాకు చెందిన దంపతులు తమ 6 రోజుల మగ శిశువును అనారోగ్య కారణాలతో ఏప్రిల్ 25 న నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రిలో చేర్చారు. శిశువు తీవ్రమైన శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నాడు. అయితే ఆస్పత్రిలో చేర్చిన కొద్దిసేపటికే ఆ తల్లిదండ్రులు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడాన్ని గమనించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే నాంపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

### ప్రాణాలు కాపాడిన వైద్యులు..

తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లినప్పటికీ, నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఆ పసికందును ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. బాబును వెంటనే ఎన్ బీసీయూ వార్డులో ఉంచి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న పసికందును మెరుగైన సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బాబును వదిలేసి పరారీలో ఉన్న ఒడిశా దంపతులను త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.

# భద్రకాళి వద్ద ఉద్రిక్తత!

### గుడిని అపవిత్రం చేశారని ఆరోపణలు.. సంప్రోక్షణకు యత్నించిన బీజేపీ నేతలు
### అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు.. నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం
### కుడా భూముల వ్యవహారమే కారణం

**వరంగల్:** వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద వరుసగా 2 వ రోజు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుడా భూముల వేలంలో అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు గుడిలో పూజలు చేసి ఆలయాన్ని అపవిత్రం చేశారని ఆరోపిస్తూ.. శనివారం సంప్రోక్షణకు యత్నించిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) భూముల వేలం వ్యవహారం వరంగల్ నగరంలో రాజకీయ రగడ సృష్టిస్తోంది. ఈ వేలంలో అవినీతి జరిగిందంటూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు తడి బట్టలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అధికార, ప్రతిపక్షాల సవాళ్లతో భద్రకాళి ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



### ఆలయ శుద్ధికి బీజేపీ యత్నం..

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయాలతో గుడిని అపవిత్రం చేశారని ఆరోపిస్తూ ఆలయ సంప్రోక్షణకు బీజేపీ పిలుపునిచ్చింది. శుద్ధి కార్యక్రమం పేరుతో శనివారం గుడి వద్దకు వచ్చిన బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు వారిని ప్రాంగణంలోకి అనుమతించలేదు. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని, కచ్చితంగా సంప్రోక్షణ నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. పోలీసుల చర్యతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. పలువురు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భద్రకాళి ఆలయం వద్ద జరిగిన ఈ పరిణామంతో స్థానిక రాజకీయ వర్గాల్లో వేడి రాజుకుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో గుడి పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# కుళ్లిపోయిన మాంసం, కల్తీ పేస్టులు

### 100 రోజుల్లో 185 కేసులు.. భారీగా కల్తీ పదార్థాల సీజ్
### హోటళ్లపై హెచ్ ఫాస్ట్ దాడులు.. ఫిర్యాదులకు సీపీ సజ్జనార్ పిలుపు



**హైదరాబాద్:** నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ రాయుళ్లపై హెచ్ ఫాస్ట్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత 100 రోజుల్లో ఏకంగా 185 కేసులు నమోదు చేసి కుళ్లిపోయిన మాంసం, కల్తీ పదార్థాలను భారీగా సీజ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీపీ వీసీ సజ్జనార్ కఠినంగా హెచ్చరించారు. ఆహార కల్తీపై హెచ్ ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. మార్చి 19 న ప్రారంభమైన దాడులకు 100 రోజులు పూర్తి అయ్యాయి. ఈ 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### పీడీ యాక్ట్ నమోదు చేస్తాం..

అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పన్నీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదు అవ్వగా, పన్నీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, బేకరీలకు అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. లైసెన్స్ విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100 లేదా వాట్సాప్ నంబర్ 8712661212 కు సమాచారం ఇవ్వాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

# సాహితి హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

### న్యూరో, ఆర్థో, డయాబెటిక్ రోగులకు ఉచిత పరీక్షలు
### శస్త్రచికిత్సలు, ల్యాబ్ టెస్టులపై భారీ తగ్గింపులు
### సద్వినియోగం చేసుకోవాలన్న సాహితి హాస్పిటల్ నిర్వాహకులు




**సంగారెడ్డి, జూలై 05 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని సాహితి హాస్పిటల్‌లో ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఉచిత శిబిరంతో పాటు ఉచిత రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నరాలు, మెదడు, ఎముకలు, కీళ్లు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి వైద్యుల సలహాలు అందిస్తారు. పక్షవాతం, ముఖం వంకర కావడం, వెన్నుపూస, మెడ, నడుము నొప్పులు, ఫిట్స్, తలనొప్పి, మైగ్రేన్ సమస్యలకు చికిత్స చేస్తారు. అలాగే కాళ్లు చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనత, నిద్ర సమస్యలు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, సయాటికా, యాక్సిడెంట్ కేసులకు నిపుణులు వైద్యం అందిస్తారు.

### శస్త్రచికిత్సలు, ల్యాబ్ పరీక్షలపై రాయితీలు

శిబిరంలో అన్ని రకాల ఆర్థోపెడిక్ సర్జరీలపై 20 శాతం ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నారు. పీఎల్‌బీఎస్ పరీక్ష పూర్తిగా ఉచితంగా చేస్తారు. ఏ ల్యాబ్ పరీక్షపైనైనా 50 శాతం, మందులపై 15 శాతం తగ్గింపు ఉంటుంది. ప్రత్యేక ఆఫర్ల కింద ఎన్‌సీఎస్ పరీక్షను 2500 రూపాయల స్థానంలో 599 రూపాయలకే, ఈఈజీ పరీక్షను 3500 రూపాయల స్థానంలో 999 రూపాయలకే, హెచ్‌బీఏ1సీ పరీక్షను 600 రూపాయల స్థానంలో 500 రూపాయలకే నిర్ధారించనున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్, ట్రామా సర్జన్ డాక్టర్ అబ్దుల్ రావూఫ్ శివఎంబీబీఎస్, ఎంఎస్ (ఆర్థో)రి రోగులకు వైద్య సేవలు అందిస్తారు. ఈ శిబిరం ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉచిత రక్తదాన శిబిరం జరుగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్ళ, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం


- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ




**జయపుర, జులై 4:** పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ–పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ. 1.06 లక్షల కోట్ల విలువైన పెట్రో కెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ. 75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ. 950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు


- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

- భైరవ సేన అనే సంస్థ ఆరోపణలు
- అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ



**డెహ్రాడూన్, జులై 4:** అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా బద్రీనాథ్ ధామ్‌లోనూ ఇలాంటి పుకార్లు జోరందుకున్నాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ మేరకు బీకేటీసీ ప్రెసిడెంట్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలనూ కోరాం' అని తెలిపారు. కాగా.. బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భైరవ సేన అనే ఓ సంస్థ ఆరోపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడికి సంబంధమున్న నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అయితే.. దీనిపై ప్రెసిడెంట్ ద్వివేది స్పందిస్తూ.. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొన్న వ్యక్తి బీకేటీసీలో ఓ ఉద్యోగి మాత్రమేనన్నారు. ఆయన గతంలో ముగ్గురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై బీకేటీసీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోం ఆరోపణలు రావడంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాం. కానీ ఆ ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో పూర్తివివరాలు తెలియరాలేదు. అయినప్పటికీ ఈ విషయం అత్యంత సున్నితమైనదిగా భావించి, ఛైర్మన్‌కు నివేదించాం' అని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలతో సదరు ఉద్యోగుల వివరాలు సేకరించడం సహా వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. విచారణలో ఎవరైనా తప్పుచేసినట్లు రుజువైతే.. వారిపై బీకేటీసీ చట్టం–1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కావడంతో నిరాధార ఆరోపణలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జీ అడ్వకేట్ నిషాని రామచంద్రం



**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ టౌన్:** ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంబించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హజరైన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ ఆదివాసీల భూ హక్కులు చాలా మంది గోండు, కొలాం, నాయక్పోడ్, ప్రధాన్ వంటి ఆదివాసీ కుటుంబాలకు సాగు చేస్తున్న భూములపై పూర్తి హక్కులు కల్పించకుండా భూములు లాక్కోవడం సరికాదన్నారు. ఆదివాసీ ప్రజలకు విద్య అందించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మారు మూల తండాలు, గూడేలలో పాఠశాలలు ఉన్నా ఉపాధ్యాయుల కొరత ఉండడం వల్ల ఆదివాసులు విద్యా కు దూరం అవుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యకు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత నుండి స్థానిక ఎమ్మెల్యే , కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యాయని అన్నారు. ఆదివాసీల ఆరోగ్యం విషయంలో కూడ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు.గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు సమయానికి అందకపోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దూరంగా ఉండటం, అంబులెన్స్ సౌకర్యం ఆలస్యం కావడం వంటి సమస్యలు ఉన్నాయి అని అన్నారు. ఎన్నికల సమయంలో ఆదివాసీల కోసం అనేక వాగ్దానాలు చేశారని అవి నేడు అమలు కావడం లేదన్నారు. అందుకే ఆదివాసీలు బహుజన ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. వారితో పాటు ఎస్సీలు ముస్లిం లు బహుజన రాజ్యాధికారం కోసం బెహన్ జీ మాయావతి నాయకత్వంలో పని చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మతం పేరు మీద ప్రజలను విడదీసి నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. మనం అందరం ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ , పార్లమెంట్ ఇంచార్జ్ సాలం బిన్ హసన్ ,జిల్లా అధ్యక్షుడు దుర్గం తుకరాం, జిల్లా ఉపాధ్యక్షుడు ముదస్సీర్ హుస్సేన్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహ్మద్ సిరాజుద్దీన్ , ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కనక ప్రభాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి చునార్ కర్ చరణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) లిమిటెడ్ కార్యాలయంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ అలీ బిన్ అహ్మద్ సహకార సంఘం ప్రాంగణంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ అలీ బిన్ అహ్మద్ మాట్లాడుతూ రైతాంగ సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు ఎంతో దోహదపడుతున్నాయని, రైతులందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రుకోం ప్రహ్లాద , డైరెక్టర్ నారా ఆశన్న, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ వెంకట రవీందర్, సీ ఓ వెంకటరమణ, రాజంపేట గ్రామపంచాయతీ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** అర్హులైన ప్రతి ఒక్క లభిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని మాజీ ఎంఎల్ఏ ఆత్రం సక్కు, మాజీ డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావులు అన్నారు. శనివారం మండలంలోని బూరుగూడ గ్రామంలో నేరేళ్ల శ్రీనివాస్ ప్రేమల దంపతుల ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అన్నారు. అనంతరం ఆ దంపతులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట బూరుగూడ మాజీ ఎంపీటీసీ మేకర్తి శ్రీనివాస్, నాయకులు నిఖిల్, ఆసీఫ్, గాజుల జలపతి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్ట ర్‌రాజర్షిషా




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఈవీఎంల భద్రత, నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం శాంతి నగర్లోని ఈవీఎం గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, ప్రవేశ నియంత్రణ, ఈవీఎంల నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల భద్రత, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గోదాం వద్ద 24 గంటల భద్రతా పర్యవేక్షణ కొనసాగించాలని, సీసీటీవీ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్వహణ రిజిస్టర్లు, లాగ్బుక్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, నాయబ్ తహశీల్దార్, సంబంధిత రెవెన్యూ, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పులకు తావివ్వొద్దు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సూపర్వైజర్లు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పిలుపునిచ్చారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్టీ నాయకులు వారికి అండగా నిలవాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ప్రతి దరఖాస్తుదారుడి తాజా పాస్పోర్ట్ సైజు ఫోటోను తప్పనిసరిగా జత చేయాలని, పేరు, తండ్రి, భర్త పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాలను ఆధార్లో ఉన్న విధంగానే నమోదు చేయాలని అన్నారు. చిన్న పొరపాటు జరిగినా భవిష్యత్తులో ఓటర్లకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, వివరాలన్నింటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే ఫారాలను సమర్పించాలని సూచించారు. మండల, గ్రామ, బూత్ స్థాయిలో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

# దేవాలయాల అభివృద్ధికి నూతన కమిటీలు కృషి చేయాలి

ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలం రాయుడుపాలెం గ్రామంలో శనివారం దేవాలయ కమిటీల నూతన చైర్మన్లు, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాయుడుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్గా వడ్లమూడి నరసింహారావు, ఐదుగురు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే బెండాలపాడు వీరన్న–వీరభద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్గా కాకాని శ్రీనివాస రావుతో పాటు ఐదుగురు సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నూతన కమిటీలు ఆలయాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల ఆధ్యాత్మిక సంస్కృతిని పరిరక్షించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాయుడుపాలెం సర్పంచ్, నాయకులు మేడా వెంకటేశ్వరరావు, గ్రామ, మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువజన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్సీ దండే విఠల్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని 17వ వార్డులో స్థానిక ప్రజల సౌకర్యార్థం చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ కావేటి విజయ్ సూచన మేరకు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, కౌన్సిలర్ ఎమ్మాజీ శారద, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొరల నిరంకుశ పాలనకు, వెట్టిచాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ధైర్యసాహసాలు, ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సేవా దృక్పథంతో సమాజానికి ఉపయోగపడేలా పనిచేయడం ద్వారా ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్ మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, త్యాగాలు, పోరాటాలను భావి తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారి జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ క్రాంతి పథకంతో రైతులకు చేయూత

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ క్రాంతి పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని హర్కాపూర్ గ్రామ సర్పంచ్ నిశాంత్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం కిసాన్ క్రాంతి పథకం కింద ఎంపికైన రైతులకు వంద శాతం రాయితీపై పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పలువురు రైతులు ఎకరానికి తక్కువ మొక్కల సాంద్రతతో పత్తి సాగు చేయడం ద్వారా దిగుబడి తగ్గడంతో పాటు సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిలో స్వల్పకాలిక పత్తి రకాలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ సిఫార్సులను అనుసరించి శాస్త్రీయ విధానాల్లో సాగు చేపడితే ఉత్పాదకత పెరిగి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీంరావు, గ్రామ కార్యదర్శి సుధీర్, సీతారాం, నాగారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య, దీపక్, సాయిరాం, జ్యోతి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ఉద్యమ కెరటం, తలమడుగు:** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద తొమ్మిది రోజుల్లో రూ.9 కోట్ల నిధులను విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కస్తాల ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలోనే భారీ మొత్తంలో రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న, సర్పంచ్లు బోన్ల మహేందర్, దేవళ్ళ పొచ్చన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబూఖాన్, కాంగ్రెస్ నాయకులు ఎల్.ప్రవీణ్ రెడ్డి, ఎస్.దేవన్న, విలాస్ యాదవ్, లింగన్న, రఫీక్, పోతయ్య, లస్మన్న, దేవిదాస్, మోహన్, గంగారాం, సిలర్ శ్రీరామ్, వెంకన్న, లచ్చన్న, నర్సయ్య, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బ్లాక్ మనీ పేరుతో డెకాయిటీలు

- **ముగ్గు రు అరెస్ట్ ,1.50 లక్షలు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా వేంసూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన డెకాయిటీ కేసులో మరో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తును సత్తుపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎల్. ముత్తులింగయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.కల్లూరు ఏసీపీ శ్రీమతి వసుంధరా యాదవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టగా, వేంసూరు–లంకపల్లి రోడ్డులోని గ్రీన్‌ఫీల్డ్ హైవే వేంసూరు ఎగ్జిట్ సమీపంలోని మామిడి తోటలో నిందితులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించారు. అక్కడ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్ల ందు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ తాళ్లూరి కిషోర్ ఫిర్యాదు మేరకు జూన్ 30న నమోదైంది.పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వాడపల్లి విజయ్ (26), రామానగరం గ్రామం, సత్తుపల్లి మండలం,గుమ్మళ్ల సుమంత్ (32), మల్లా యిగూడెం గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా,కొంగల వంశి (26), తుమ్మూరు గ్రామం, సత్తుపల్లి మండలం.ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు ఈద చంటి బాబు, అలాగే టీజీఎస్పీ 15వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ముళ్లగిరి వర్ధన్‌ను జూలై 2న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.నిందితులు వివిధ సిమ్ కార్డులతో అమాయకులకు ఫోన్ చేసి తమ వద్ద కోట్ల రూపాయల "బ్లాక్ మనీ" ఉందని, దానిని "వైట్ మనీ"గా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు. బాధితులు నగదు ఇస్తే నాలుగు రెట్లు ఎక్కువ మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. అక్కడ డమ్మీ కరెన్సీతో ఉన్న బ్యాగ్‌ను చూపించి, బాధితులు తీసుకొచ్చిన అసలు నగదును లెక్కించే సమయంలో ముందుగానే పథకం ప్రకారం నకిలీ పోలీసులు, సహచరులతో కలిసి అక్కడికి చేరుకుని, దొంగనోట్లు వ్యాపారం చేస్తున్నారంటూ లేదా మోస్ట్ వాంటెడ్ నేరస్తులంటూ బెదిరించి, అవసరమైతే కొట్టి, బాధితుల వద్ద ఉన్న నగదును దోచుకుని పరారయ్యేవారని పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, ఒక పల్సర్ మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో సబ్‌ఇన్‌స్పెక్టర్ టి. కవితతో పాటు వేంసూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



# కన్న కొడుకుని హత్య చేసిన తండ్రి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లాలోని కల్లూరు పట్టణంలో శుక్రవారం రాత్రి హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కన్నకొడుకును తండ్రే అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు పట్ట ణంలోని అంబేద్కర్ నగర్కు చెందిన కొత్తపల్లి సీతారాములు అనే ఆటో డ్రైవర్ మద్యం మత్తులో తన కుమారుడు కొత్తపల్లి కిరణ్ కుమార్ (30)ను సమీపంలోని బెల్ట్ షాపుకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. అనంతరం ఇద్దరూ ఇంటికి వెళ్లి న తర్వాత వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కిరణ్ కుమార్ తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో అధిక రక్తస్రావం జరిగి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం సీతారాములు పరారైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో జరిగిన ఈ విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిందితుడి కోసం మూడు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టా యి. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# భద్రకాళి ఆలయం వద్ద బీజేపీ శుద్ధి కార్యక్రమం

- **పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**ఉద్యమ కెరటం, వరంగల్:** వరంగల్లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయం వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఆలయ శుద్ధి కార్యక్రమం సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమానికి హాజరైన పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని మట్వాడ పోలీస్ స్టేషన్కు తరలించారు. బీజేపీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. చైర్మన్ వెంకట్రాం రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మర్రి యాదవ రెడ్డి దొంగ ప్రమాణాలు చేస్తూ తడి బట్ట లతో ఆలయంలోకి ప్రవేశించి ఆలయ పవిత్రతను భంగపరిచారని ఆరోపిస్తూ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి చేరుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసులు నమోదు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవి, మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత, 47వ డివిజన్ అధ్యక్షుడు గంధసిరి శ్రీకాంత్, 63వ డివిజన్ నాయకుడు రేణికుంట్ల కళ్యాణ్, డివిజన్ అధ్యక్షుడు కూడికల ప్రసాద్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షురాలు పద్మ, మండల ఉపాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నట్లు తెలిపారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు.

# బుగ్గ పాడు ఫుడ్ పార్క్ భూములపై బీజేపీ రాస్తా రోకో పిలుపు

## నాయకుల ముందస్తు అరెస్టు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గంలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఖమ్మం జిల్లా శాఖ శనివారం సత్తుపల్లి పట్ట ణంలో రాస్తారోకో కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టే షన్లకు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లా డుతూ శాంతియుత నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు తెల్లవారుజాము నుంచే నాయకులను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల గొంతు నొక్కే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల వ్యవహారంపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల నున్నట్లుపేర్కొన్నారు. ఫుడ్ పార్క్ భూములను పరిరక్షించే వరకు భారతీయ జనతా పార్టీ తన ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, స్థానిక ప్రజల హక్కులు, ఆకాంక్షలు నెరవేరే వరకు పోరాటం ఆగదని స్పష్ట ం చేశారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్త లు సైనికుల్లా పనిచేయాలి

**ఉద్యమ కెరటం, బోథ్:** పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం బోథ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్–2 సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ బోథ్ మండల అబ్జర్వర్ ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మండల కన్వీనర్ మేరుగు భోజన్నతో పాటు మండలంలోని బీఎల్ఏ–2లు, సూపర్వైజర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లా డుతూ ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో బీఎల్ఏ–2ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్యకర్తలు పార్టీని మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి కార్యకర్త బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టి లో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కురుమే మహేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా స్పోక్పర్సన్ పసుల చంటి, అంజయ్య, సూపర్వైజర్లు షేక్ మొహమ్మద్, షమిందర్, శ్రీనివాస్, దశరథ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు నరసింహదాస్, వినయ్ రెడ్డి, అరుణ్ కుమార్, నక్కలవాడ సర్పంచ్ నవీన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హులైన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలి

**ఉద్యమ కెరటం, భీంపూర్:** అర్హులైన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని మాజీ సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా నమోదు, ప్రక్షాళన కార్యక్రమంపై శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల తర్వాత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. పాత ఓటర్ కార్డులు లేకపోవడం, పేర్ల లో తప్పులు ఉండడం, ఓటు తొలగిపోతుందేమోనని ఆందోళన చెందుతున్న గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఆన్లై న్లో ఓటరు వివరాలను ఎలా సరిచూసుకోవాలి వంటి అంశాలపై యువతతో పాటు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు అవసరమైన ఆధారాలను అందించి, ఓటర్ల జాబితాలోని తమ వివరాలను తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు.

# వరి సాగులో సరికొత్త పరిరక్షణ, బోనస్ ఆదాయం

- **పర్యావరణాన్ని కాపాడితే నేరుగా రైతు ఖాతాల్లో కే కార్బన్ క్రెడిట్స్ నగదు బదిలీ**
- **ఢిల్లీ వ్యవసాయ శాస్త్రవేత్త లతో రైతులకు అవగాహన సదస్సు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సాంప్రదాయ వరి సాగులో పెట్టుబడులు నానాటికీ పెరిగిపోతూ, సాగునీటి లభ్యత తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో సత్తుపల్లి మండల వరి రైతులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై మార్గదర్శకత్వం లభించింది. చేంజ్ అలయన్స్, డి బి ఆర్ సి, వరాహ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కాకరపల్లి రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి విచ్చేసిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొని రైతులకు ప్రత్యక్షంగా దిశానిర్దేశం చేశారు. రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ లాభసాటి వ్యవసాయంతో అభివృద్ధి చెందాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ ప్యాడీ ప్రాజెక్టు లో భాగమైన తడి–పొడి సాగు విధానం సమర్థవంతమైన పరిష్కారమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ విధానంతో సుమారు 30 శాతం వరకు నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం, మోటార్ల నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. తక్కువ నీటితోనే నాణ్యమైన, స్థిరమైన దిగుబడిని సాధించవచ్చని పేర్కొన్నారు. తడి–పొడి సాగు ద్వారా వరి పొలాల నుంచి వెలువడే మిథేన్ వాయు ఉద్గారాలు సుమారు 48 శాతం వరకు తగ్గుతాయని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైన రైతులకు కార్బన్ క్రెడిట్స్ రూపంలో అదనపు ఆర్థిక ప్రోత్సాహకాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థల ద్వారా ఈ ప్రోత్సాహకాలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యే విధానంపై వివరించారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించాలని ఢిల్లీ వ్యవసాయ శాస్త్రవేత్త బాసబ్, ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, బాబ్జి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష, కాకరపల్లి సర్పంచ్ పొదిలి మహేశ్వరరావు, మండల కోఆర్డినేటర్ మహేశ్వరరావు, రవిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్డు గుంతలకు తక్షణ పరిష్కారం

## సర్పంచ్ ఆడే శీల చొరవతో మరమ్మతు పనులు పూర్తి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ బస్టాండ్ సమీపంలోని నిర్మల్–ఆదిలాబాద్ సర్వీస్ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టించారు. ఈ సర్వీస్ రోడ్డు గుండా ప్రతిరోజూ వందలాది వాహనాలు ఆదిలాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో సమస్యను గుర్తించిన సర్పంచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టించి దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చొరవపై స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామపంచాయతీ చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. మరమ్మతు పనుల పర్యవేక్షణలో గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, మచ్చాపూర్ సర్పంచ్ రాథోడ్ ప్రతాప్, డోంగర్గావ్ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్, ముత్నూర్ తండా సర్పంచ్ జాదవ్ రాంజీ పాల్గొన్నారు.

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**






ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: పంట మార్పిడి విధానాలు అవలంభించడంతో పాటు ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్ట ర్లు వ్యవసాయ, వైద్య, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026–27 సంవత్సరానికి రాష్ట్రంలో 85వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్యాల సాధనకు జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పంట మార్పిడి విధానాలను రైతులు పాటించేలా అవగాహన కల్పించాలని, కూరగాయల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని అన్నారు. రైతులకు యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులను పక్కదారి పట్టి ంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్ట ర్లు ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించారు. దేశంలో ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం నమోదు చేసి మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్ట రేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ మంద మకరందు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, డీఈఓ మాధవి, డీఐఈఓ గణేష్ జాదవ్, పంచాయతీ రాజ్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.129.25 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలోని ఈవీఎం గోదామును సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరం

## జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజలకు నాణ్యమైన తాగునీటిని నిరంతరాయంగా అందించేందుకు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. శనివారం ఎల్లంపల్లి సెగ్మెంట్లోని గుడిపేట నీటి శుద్ధి కేంద్రాన్ని ఈఈ (గ్రిడ్ ఎంబీ) కె.మధుసూదన్, హాజీపూర్ తహశీల్దార్ పుష్పలత, డీఈఈలు, ఏఈఈలు తదితర అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్ట్రేషన్, క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు, పంపింగ్ వ్యవస్థ, నిల్వ సామర్థ్యం, విద్యుత్ సరఫరా, నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన నీరు అందించేందుకు అన్ని ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్లాంట్లోని వివిధ విభాగాలను పరిశీలించి యంత్రాల నిర్వహణ, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నియామక విధానం, విధుల నిర్వహణ, హాజరు, వేతనాల చెల్లింపు తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అలుపెరగని పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం పాలనలో అణచివేతకు గురవుతున్న ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ సాయుధ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో దొడ్డి కొమురయ్య కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల సంక్షేమం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ విక్రయాలపై వివాదం

- బిల్లింగ్ విధానంపై రైతుల ఆందోళన



**ఉద్యమ కెరటం, వాంకిడి:** తగ్గిస్తారు.. లెక్కిస్తారు.. చెక్కు ఇస్తారు.. కానీ బిల్లుపై మాత్రం పూర్తి ధరనే నమోదు చేస్తారు.. అంటూ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని పలువురు రైతులు ఫర్టిలైజర్ దుకాణాల వ్యాపార విధానంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్లో ఎరువుల కొనుగోలు కోసం దుకాణాలకు వెళ్లే అమాయక రైతులు వ్యాపార లెక్కలు పూర్తిగా తెలియక అధిక ధరలు చెల్లించి అప్పుల పాలవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా కొన్ని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ధరల వ్యవహారం, బిల్లింగ్ విధానం, రైతులకు ఇచ్చే రాయితీలు, బిల్లుల్లో చూపే మొత్తాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది రైతులు నగదు, చెక్కు రూపంలో కొంత మొత్తం తగ్గించినట్లు చెప్పినా, తుది బిల్లులో మాత్రం పూర్తి ధరనే నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ అంశంపై ఫర్టిలైజర్ దుకాణాల యూనియన్కు నాయకత్వం వహిస్తున్న ఓ వ్యాపారిని మీడియా ప్రతినిధులు సంప్రదించగా, ఏం రాస్తారో రాసుకోండి.. మేమంతా నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాం" అని ఆయన స్పందించినట్లు సమాచారం. అయితే అదే సమయంలో ఆయన ఒక డైరీలో వరుసగా పాత్రికేయుల పేర్లు నమోదు చేస్తున్నట్లు కొందరు విలేకరులు గమనించినట్లు చెబుతున్నారు. అనంతరం ఆ డైరీని రహస్యంగా పక్కన పెట్టినట్లు కూడా వారు పేర్కొన్నారు. ఒకవేళ వ్యాపార లావాదేవీలు పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉంటే, పాత్రికేయుల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆ డైరీలో పేర్లు నమోదు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి..? కేవలం సందర్శించిన వారి వివరాల కోసమేనా..? లేక మరేదైనా కారణమా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయంపై సంబంధిత వ్యాపారి నుంచి కూడా పూర్తి వివరణ రావాల్సి ఉంది. రైతులు మరోవైపు ఎరువుల విక్రయంలో బిల్లింగ్ విధానం, ధరల నిర్ణయం, రాయితీల అమలు, స్టాక్ నిర్వహణ వంటి అంశాలపై వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజీ, వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. నిజంగా ఎక్కడైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు అసత్యమైతే వాటిపై కూడా స్పష్టత ఇవ్వాలని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. వాంకిడి మండలంలోని ఫర్టిలైజర్ వ్యాపార వ్యవహారాలపై మరిన్ని వివరాలు, సంబంధిత పత్రాలు, రైతుల వాంగ్మూలాలు, అధికారుల స్పందన వెలుగులోకి రావాల్సి ఉంది. పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### ఫర్టిలైజర్ షాపులపై సమగ్ర విచారణ జరపాలి..

**బోట్పెల్లి జైరామ్, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు**

వాంకిడి మండల వ్యాప్తంగా ఉన్న కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు విక్రయిస్తున్న ఎరువుల ధరల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు నగదు, చెక్కు రూపంలో కొంత మొత్తం తగ్గించి ఇచ్చినట్లు చూపిస్తూ, బిల్లుపై మాత్రం పూర్తి ధర నమోదు చేస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలతో కాకుండా లోతైన విచారణ చేపట్టి వాస్తవాలు వెలికితీయాలి. వాంకిడి మండలంలోని ఫర్టిలైజర్ వ్యాపారులపై రైతుల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా సీజన్ సమయంలో యూరియా, పత్తి విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమాయక రైతులు వ్యాపార లావాదేవీల్లో అవగాహన లేకపోవడంతో అధిక ధరలు చెల్లించి అప్పుల పాలవుతున్నారు. కొన్ని :ర్టిలైజర్ దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, అనుమతులు, ఇతర చట్టబద్ధ పత్రాలు సక్రమంగా ఉన్నాయా అనే విషయంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లైసెన్సు ఒకరి పేరుపై ఉండి, రెండు మూడు షాపులు వ్యాపారం మరొకరు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలి. ప్రతి ఏడాది వ్యవసాయ సీజన్లో యూరియా, పత్తి విత్తనాలు, పురుగు మందుల ధరలు పెరగడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొంత మంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాలతో కలిసి తీవ్ర సంక్షోభంలో పడుతున్నారు. రైతుల కష్టార్జిత ధనాన్ని దోచుకునే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు. రైతుల పక్షాన తమ సంఘం ఎల్లప్పుడూ నిలుస్తుంది. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తాం. ఫర్టిలైజర్ వ్యాపారుల లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమాలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నిజాయితీగా వ్యాపారం చేసే వ్యాపారులు రైతులకు ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలి. వ్యవసాయ రంగంపై రైతుల విశ్వాసాన్ని నిలబెట్టాలి.

# అభివృద్ధి పనుల్లోవేగం పెంచాలి

- ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ రాజర్షిషా
- కలెక్టరేట్లో 'దిశ' సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష
- పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా అమలు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో ఎంపీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉపాధిహామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ భవనాల నిర్మాణం, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రైతులకు యూరియా, ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల



నిర్మాణానికి సంబంధించిన అటవీ అనుమతుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి 'దిశ' సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపీ గోడం నగేశ్ తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఐటిడిఏ పీఓ మంద మకరందు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో ఐటీడీఏ ఆశ్రమ పాఠశాల నూతన భవనానికి భూమిపూజ

- ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలకు రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన భవనానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ, ప్రధాన మంత్రి ఆవాస్–ఐటీడీఏ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులను ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులందరికీ మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన వసతులు కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని



తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ సహా అన్ని సంక్షేమ శాఖల హాస్టళ్లు, విద్యా సంస్థల సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ మరింత సహకారం అందించాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో సురక్షితమైన నివాసం, పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన భోజనం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఇతర సంక్షేమ శాఖల హాస్టళ్లు, విద్యాసంస్థలను ప్రతి వారం స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్, ఐటీడీఏ, మున్సిపల్ శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తపస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం తాండూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ యు.జ్యోత్స్నకు తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు చాలా కాలంగా పెండింగ్లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడంతో పాటు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, టిఫిన్లు అందిస్తామని చేసిన ప్రకటనపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులను సమాజంలో చులకన చేసే విధంగా ఉందని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు బగ్గని రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్, రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్, మండల అధ్యక్షుడు వరప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఎం.రమేష్, రవిబాబు, వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్లో 91 ఏళ్ల వృద్ధురాలు పేరు నమోదు



- ప్రజాస్వామ్య చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో 91 ఏళ్ల వృద్ధురాలు దుర్గం బక్కుబాయి శనివారం ఉత్సాహంగా పాల్గొని తన పేరు నమోదు చేసుకున్నారు. వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజాస్వామ్యంపై తనకున్న నమ్మకాన్ని చాటుతూ సంబంధిత అధికారులకు దరఖాస్తు అందజేశారు. బూత్ నం.124లో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఎండి. జుబేర్, బీఎల్వో కె.విజయలక్ష్మి , బీఎల్ఏ అబ్దుల్ రెహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. 91 ఏళ్ల వయస్సులోనూ దుర్గం బక్కుబాయి స్వయంగా హాజరై ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనడం ప్రజాస్వామ్యంపై ఆమెకున్న చైతన్యానికి నిదర్శనంగా నిలిచిందని, ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

# పాఠశాల విద్యా ప్రమాణాలపై పాలకవర్గం ఆందోళన

- ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తి
- విద్యార్థుల భవిష్యత్తు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండలంలోని సరండి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయంటూ గ్రామపంచాయతీ పాలకవర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామ సర్పంచ్ బాపూజీ, గ్రామ పటేల్ కొట్రాంగే మేంఘజి, నాలుగో వార్డు సభ్యురాలు మహేశ్వరి, గ్రామ పెద్దలు పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన తీరు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గత కొంత కాలంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందకపోవడంతో వారి చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. పాఠశాల సందర్శన సందర్భంగా ప్రజాప్రతినిధులు విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు సమయానికి తరగతులకు వస్తున్నారా, పాఠాలు సక్రమంగా బోధిస్తున్నారా, పాఠ్యాంశాలు పూర్తవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న తరగతుల విద్యార్థులకు పునాది విద్య అత్యంత కీలకమని, ఈ దశలో నిర్లక్ష్యం భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ బాపూజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే నాణ్యమైన విద్య అందాలని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితి రావద్దని అన్నారు. గ్రామ పటేల్ కొట్రాంగే మేంఘజి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీ పడేలా బోధన ఉండాలని, ఉపాధ్యాయులు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. వార్డు సభ్యురాలు మహేశ్వరి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎన్నో ఆశలతో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుని పనితీరులో మార్పు రావాలని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్పై నియమించి విద్యార్థులకు నిరంతర బోధన అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ పాలకవర్గం విద్యా శాఖ అధికారులను డిమాండ్ చేసింది. అలాగే పాఠశాల పరిస్థితులపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు కూడా విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

# లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు, ఇతర సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, ఆర్ఓ కల్యాణ్, టీపీఓ సుమలత, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, వార్డు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని 49 వార్డుల్లో సుమారు 9 నుంచి 12 వార్డులు లోతట్టు ప్రాంతాలుగా గుర్తించామని, భారీ వర్షాల సమయంలో ఈ ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా కాల్వలు, డ్రైనేజీలను ముందుగానే శుభ్రం చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వన్టౌన్ ప్రాంతానికి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ అవికిరణ్, టూటౌన్ ప్రాంతానికి ఆర్ఓ వెంకటేష్లను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించేందుకు 9000018842 హెల్ప్లైన్ నంబర్ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. భారీ వర్షాల సమయంలో వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వాటర్ సెక్షన్, శానిటేషన్ సిబ్బంది విధుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అత్యవసర సహాయక చర్యల కోసం జేసీబీలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో న్యాయ చైతన్యం పెంపొందించాలి




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** విద్యార్థుల్లో న్యాయ చైతన్యం పెంపొందించాలని ఆసిఫాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సంకేత్ మిత్రా అన్నారు. కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు లీగల్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ నిరోధక చట్టం, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై సరైన అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు.న్యాయవాది ఎం.అంజని దేవి మాట్లాడుతూ వివిధ చట్టాలు, వాటికి సంబంధించిన శిక్షల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్లప్పుడూ చట్ట పరిధిలోనే వ్యవహరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. స్థానిక టౌన్ ఎస్సై కె.రాజు మాట్లాడుతూ తెలియక చేసే నేరాలు కూడా యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులయ్యే పరిస్థితులు తలెత్తవచ్చని అన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు త్వరలో వెలువడనున్న పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శారద, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, టి.దత్తాత్రేయ, దేవేందర్, కృష్ణవేణి, రోజ్ మేరి తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్

- అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి
- టీజీఎస్డబ్ల్యూఆర్ఐఈఎస్ సమన్వయకర్త రామ కళ్యాణి



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో మిగిలిన ఖాళీల భర్తీ కోసం ఈనెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, టీజీఎస్డబ్ల్యూఆర్ఐఈఎస్ జిల్లా సమన్వయకర్త రామ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలుర గురుకుల జూనియర్ కళాశాలలు బెల్లంపల్లి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జైపూర్), మంచిర్యాల, కాసిపేటతో పాటు బాలికల గురుకుల జూనియర్ కళాశాలలు లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లిలో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలికలకు లక్షెట్టిపేట గురుకుల జూనియర్ కళాశాలలో, బాలురకు జైపూర్ గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తుల నమోదు, మధ్యాహ్నం 1 గంటకు మెరిట్ జాబితా ప్రకటించి, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని వివరించారు. మార్చిలో నిర్వహించిన ఎస్ఎస్సీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పరీక్షలను ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. పదో తరగతి మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు కూడా ఇంగ్లీష్ మీడియం గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఉండాలని, సంబంధిత తహశీల్దార్ జారీ చేసిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 2026 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు మించరాదని, ఎస్సీ అభ్యర్థులకు ఒక సంవత్సరం వయో సడలింపు ఉంటుందని వివరించారు. ఇప్పటికే జోనల్ కార్యాలయం, వివిధ గురుకుల కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా స్పాట్ కౌన్సిలింగ్కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు మరుసటి రోజే కళాశాలలో చేరాలని, ఈనెల 10వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించని పక్షంలో అడ్మిషన్ రద్దు చేయబడుతుందని వివరించారు.

# రూ.89 లక్షల విలువైన 166 కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి హైదరాబాద్కు అక్రమ రవాణా
- నిందితుడు అరెస్ట్.. రిమాండ్కు తరలింపు





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్కు అక్రమంగా తరలిస్తున్న సుమారు 166 కిలోల 360 గ్రాముల గంజాయిని సత్తుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.89 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితుడు ప్రబిన్ భాత్రాను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి కారులో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ బృందం, సత్తుపల్లి పోలీసులు శుక్రవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును తనిఖీ చేయగా డిక్కీలో ఆరు ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 80 ప్యాకెట్లలో గంజాయి లభ్యమైంది. అనంతరం నిందితుడు ప్రబిన్ భాత్రాను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి గంజాయితో పాటు ఒక కారు, ఒక సెల్ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఒడిశాకు చెందిన బికారి అలియాస్ రోహన్ అనే వ్యక్తి ఈ గంజాయిని హైదరాబాద్లో తాను సూచించిన వ్యక్తికి అప్పగిస్తే రూ.10వేల పారితోషికం ఇస్తానని ప్రబిన్ భాత్రాకు చెప్పినట్లు వెల్లడైంది. దారకొండ జంక్షన్ నుంచి రాజమండ్రి మీదుగా గ్రీన్ఫీల్డ్ హైవే ద్వారా హైదరాబాద్కు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# వానాకాలం వ్యవసాయ సాగుకు సన్నద్ధం కావాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వానాకాలం వ్యవసాయ సీజన్ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, రైతు రిజిస్ట్రీ, పంటల వైవిధ్యీకరణ, త్రాగునీరు, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, విద్య, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2026 వానాకాలం సీజన్లో 138.49 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని 68 మందిని అరెస్టు చేయడంతో పాటు 34 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందుగానే నిల్వ ఉంచాలని, యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతు రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి రైతు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికెన్గున్యా, టైఫాయిడ్ వంటి కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్లు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దోమల నివారణ, లార్వా నిర్మూలన, ఫాగింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు, ఆసుపత్రుల్లో మందులు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను నాణ్యతతో అమలు చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఫేషియల్ రికగ్నిషన్ విధానంతో విద్యార్థుల హాజరు ఆధారంగా ఆహార అవసరాలను అంచనా వేసి వ్యర్థాలను నివారించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతు రిజిస్ట్రీ, తాగునీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, మిషన్ భగీరథ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాంగ్ కుల అస్థిత్వాన్ని కాపాడిన ప్రభుత్వం




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాంగ్ కుల అస్థిత్వాన్ని ప్రభుత్వం కాపాడిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాడేకర్ పరశురామ్ మాంగ్ అన్నారు. మాంగ్ కులానికి తహశీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తూ మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ఎన్నో ఏళ్లుగా చేస్తున్న న్యాయమైన డిమాండ్ను ప్రభుత్వం ఆమోదించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కొత్త ఉత్తర్వులతో ఇకపై తహశీల్దార్ కార్యాలయం ద్వారానే సులభంగా ధ్రువీకరణ పత్రాలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో ధ్రువీకరణ పత్రాల జారీలో ఏర్పడిన ఇబ్బందుల కారణంగా మాంగ్ కులం ఉనికి, అస్థిత్వానికి ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మాంగ్ సమాజ్ ఆత్మగౌరవం, ప్రత్యేక గుర్తింపుకు రక్షణ లభించిందన్నారు. ఇకపై మాంగ్ కులం పేరుతో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కాకుండా ప్రతి సభ్యుడు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి గాయ్ కాంబ్లే కుషాల్ రావు మాంగ్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు వాగ్మారే అంకుష్ మాంగ్, గోత్ముక్లె సుభాష్ మాంగ్, సర్పంచ్ భోస్ర, జాదవ్ గణేష్ బాబు, హరిదాస్ మాంగ్, సూర్యవంశి సాయి, మాంగ్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని మాలే బోరిగామా, చించుఘాట్ గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ 109, 106లను సందర్శించి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియను పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడికి వచ్చిన ప్రజలకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డకెట్‌కు కొత్త జోడీ!



**లండన్, జులై 4 :** వన్డే ప్రపంచకప్--2027 సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్ జట్టు ఓపెనింగ్ జోడీని ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. బెన్ డకెట్‌కు స్థిరమైన భాగస్వామి కోసం అన్వేషిస్తున్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యువ బ్యాటర్ జాకబ్ బెథెల్‌పై ఆశలు పెట్టుకుంది. మూడు ఫార్మాట్లలోనూ దూకుడైన ఆటతో ఆకట్టుకుంటున్న ఈ యువ క్రికెటర్‌ను భవిష్యత్ ఓపెనర్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న బెథెల్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌లోనే డకెట్‌కు జోడీగా పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం ఇయాన్ మోర్గాన్ నాయకత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ మరోసారి ప్రపంచకప్‌పై కన్నేసింది. మెగా టోర్నీకి మరో ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్టు కూర్పుపై బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. అయితే బెన్ డకెట్‌కు సరైన ఓపెనింగ్ భాగస్వామి ఇంకా దొరకకపోవడం ఆ జట్టుకు తలనొప్పిగా మారింది. గత కొంతకాలంగా ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలే, రెహాన్ అహ్మద్‌లకు అవకాశాలు ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో ఇప్పుడు జాకబ్ బెథెల్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటివరకు 21 వన్డేలు ఆడిన బెథెల్ 19 ఇన్నింగ్స్‌ల్లో 33.50 సగటుతో 603 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 110 పరుగులు. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం అతడిని ఓపెనర్‌గా పరిశీలించడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. వన్డేలతో పాటు టెస్టుల్లోనూ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై అతడు అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా సిడ్నీ టెస్టులో 229 బంతుల్లో 142 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ బెన్ డకెట్‌కు జోడీగా బెథెల్‌ను బరిలోకి దించే దిశగా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# మెక్సికో మ్యాచ్‌కు ఇంగ్లండ్ ప్రత్యేక వ్యూహం

**మెక్సికో సిటీ, జులై 4 :** ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికోతో తలపడనున్న ఇంగ్లండ్ జట్టు ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. అధిక ఎత్తులో ఉన్న స్టేడియంలో ఆటగాళ్లు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు వైద్యుల పర్యవేక్షణలో వయాగ్రా మాత్రల వినియోగానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ నిర్ణయం ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్‌టెకా స్టేడియంలో ఈ నాకౌట్ మ్యాచ్ జరగనుంది. సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మైదానంలో ఆక్సిజన్ సాంద్రత తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు త్వరగా అలసిపోయే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక సన్నాహాలు చేసింది. ఇప్పటికే ఆటగాళ్లు తగినంత విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేసిన జట్టు యాజమాన్యం, మ్యాచ్ సమయంలో శారీరక సామర్థ్యాన్ని నిలబెట్టేందుకు వైద్యపరమైన సూచనల మేరకు వయాగ్రా వినియోగానికి కూడా అనుమతించినట్లు తెలుస్తోంది. అధిక ఎత్తులో రక్తనాళాలు విస్తరించి రక్తప్రసరణ మెరుగుపడేందుకు వయాగ్రా కొంతమేర ఉపయోగపడుతుందని గతంలో కొన్ని వైద్య పరిశోధనలు సూచించాయి. ఇదే కారణంతో ఇంగ్లండ్ జట్టు ఈ మార్గాన్ని పరిశీలించినట్లు సమాచారం. సాధారణంగా ఈ ఔషధాన్ని వేరే వైద్య అవసరాల కోసం వినియోగించినప్పటికీ, అధిక ఎత్తులో శారీరక సామర్థ్యాన్ని మెరుగుపర్చే అవకాశాలపై కూడా కొన్ని అధ్యయనాలు జరిగాయి. ఆతిథ్య మెక్సికో ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, ఎత్తైన మైదాన పరిస్థితులు అలవాటై ఉండటంతో వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయితే ఇంగ్లండ్ ఆటగాళ్లు అలసటకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసంగా ఉన్న మెక్సికోను నిలువరించేందుకు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగుతున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.






# ప్రజ్ఞానంద జోరు.. అగ్రస్థానంలోకి

**జాగ్రెబ్, జులై 4 :** క్రొయేషియాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ర్యాపిడ్ విభాగం చివరి రోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరౌజాతో కలిసి సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్ మాత్రం చివరి రోజు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసి ఐదో స్థానానికి పరిమితమయ్యాడు. ర్యాపిడ్ విభాగంలో చివరి రోజు ప్రజ్ఞానంద పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆతిథ్య దేశం క్రొయేషియాకు చెందిన ఇవాన్ సరిక్, రొమేనియాకు చెందిన డీక్ బొగ్డన్, నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనిశ్ గిరిలపై వరుస విజయాలు నమోదు చేశాడు. ఈ మూడు విజయాలతో మొత్తం 12 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. ప్రజ్ఞానందతో సమానంగా ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరౌజా కూడా 12 పాయింట్లతో సంయుక్త అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన డి. గుకేశ్‌కు చివరి రోజు ఏమాత్రం కలిసిరాలేదు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడంతో అతడు జర్మనీకి చెందిన విన్సెంట్ కేమెర్‌తో కలిసి 10 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు టోర్నీలోని బ్లిట్జ్ విభాగం మిగిలి ఉంది. మొత్తం 18 రౌండ్ల పాటు సాగే ఈ పోటీల్లోనే గ్రాండ్ చెస్ టూర్ విజేత ఎవరో తేలనుంది. దీంతో ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# అబ్రార్‌కు దేశమా.. లీగ్‌నా?

**లాహోర్, జులై 4 :**

పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత కీలకమైన సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఒకవైపు దేశం తరఫున వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో ఆడే అవకాశం ఉండగా, మరోవైపు భారీ పారితోషికంతో ఒప్పందం కుదుర్చుకున్న ఇంగ్లండ్‌లోని ప్రముఖ ఫ్రాంచైజీ లీగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. రెండు టోర్నీల షెడ్యూళ్లు ఒకేసారి రావడంతో అబ్రార్ ఏ నిర్ణయం తీసుకుంటాడనే అంశం ఆసక్తికరంగా మారింది. పాకిస్థాన్ జట్టు ఈ నెలలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు అబ్రార్ అహ్మద్‌ను ఎంపిక చేయాలని సెలక్షన్ కమిటీ యోచిస్తోంది. అదే సమయంలో ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌కు కూడా అతడు ఎంపికయ్యాడు. ఈ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్‌ను సుమారు రూ.2.3 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ జట్టుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ యాజమాన్యం వహిస్తున్నారు. 'ది హండ్రెడ్' టోర్నీ జులై 21న ప్రారంభం కానుండగా, వెస్టిండీస్‌తో పాకిస్థాన్ తొలి టెస్టు జులై 25 నుంచి ప్రారంభమవుతుంది. దీంతో రెండు టోర్నీల్లో ఒకేసారి పాల్గొనడం సాధ్యం కాకపోవడంతో అబ్రార్ ఏదో ఒకదానిని మాత్రమే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టు జట్టులో చోటు దక్కితే లీగ్‌కు దూరం కావాల్సి ఉంటుంది. అబ్రార్‌ను 'ది హండ్రెడ్' వేలంలో కొనుగోలు చేయడం గతంలోనే పెద్ద చర్చకు దారితీసింది. భారత్–పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలు నిలిచిపోయిన నేపథ్యంలో భారత యాజమాన్యంలోని ఫ్రాంచైజీ పాకిస్థాన్ ఆటగాడిని భారీ మొత్తానికి తీసుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే అన్ని దేశాల ఆటగాళ్లకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబంధనల ప్రకారం ఎంపిక జరిగినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇక పాకిస్థాన్ జట్టు దృష్టిలో వెస్టిండీస్ పిచ్‌లపై అబ్రార్ లాంటి లెగ్ స్పిన్నర్ కీలక పాత్ర పోషిస్తాడనే అభిప్రాయం ఉంది. అందుకే అతడిని టెస్టు జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సోమవారం టెస్టు జట్టును ప్రకటించనున్న నేపథ్యంలో అబ్రార్‌కు స్థానం దక్కుతుందా లేదా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ టెస్టు జట్టులో ఎంపికైతే 'ది హండ్రెడ్' లీగ్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిరభ్యంతర పత్రం జారీ చేస్తుందా లేదా అనేది కూడా కీలకంగా మారింది. దీంతో అబ్రార్ భవిష్యత్తు ఇప్పుడు సెలక్టర్లు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

# మూడు నెలల ముచ్చటేనా?



## 'నాణ్యత' లేని కేరమెరి సిమెంట్ రోడ్డు!

## పర్యవేక్షణ గాలికొదిలేసిన సంబంధిత అధికారులు!

**ఉద్యమ కెరటం, కెరమెరి:** ప్రజాధనం వెచ్చించి చేపట్టే అభివృద్ధి పనులు ఏ మేరకు నాణ్యతా ప్రమాణాలతో సాగుతున్నాయో చెప్పడానికి కేరమెరి మండలంలో వెలుగుచూసిన ఈ ఘటనే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. మండల కేంద్రంలోని కేళీ (బి) గ్రామపంచాయతీ పరిధిలో గల కేలి (కే) గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగి మూడు నెలలు కూడా గడవక ముందే పూర్తిగా అధ్వానంగా తయారైంది. రోడ్డు వేసిన కొద్ది రోజులకే పైపెంకు (టాప్ లేయర్) పూర్తిగా లేచిపోయి, కేవలం ఇసుక, గులకరాళ్లు మాత్రమే తేలి కనిపిస్తున్నాయి. నాసిరకం పనుల వల్లే ఇంత త్వరగా రోడ్డు దెబ్బతిందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అడుగడుగునా నాణ్యతా లోపాలు!

గ్రామంలో అంతర్గత రహదారి లేక దశాబ్దాలుగా నరకం చూసిన గ్రామీణుల సౌకర్యార్థం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరించారనే ఆరోపణలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. సిమెంట్ మిశ్రమంలో సరైన నిష్పత్తి పాటించకపోవడం, నాసిరకం ఇసుక, తక్కువ పరిమాణంలో కంకర వాడటం వల్లే రోడ్డు పొరలు పొరలుగా ఊడిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు.

### పర్యవేక్షణ గాలికొదిలేసిన యంత్రాంగం..

సాధారణంగా ప్రభుత్వ నిధులతో పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి దశలోనూ నాణ్యతను పరీక్షించిన తర్వాతే బిల్లులకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ ఆశించిన స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ కంటితుడుపుగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యం ఏంటని గ్రామీణులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి తోడై ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని ఆరోపిస్తున్నారు.

### సమగ్ర విచారణ జరపాలి..

కంటితుడుపుగా పనులు చేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్‌పై, అలాగే దీనికి బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గళమెత్తుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో స్పందించి, నాణ్యత కోల్పోయిన ఈ రోడ్డు పనులపై సమగ్ర సాంకేతిక విచారణ జరిపించాలని కోరుతున్నారు.



ఉద్యమ కెరటం
ఆదివారం 5 జూలై 2026

# 10న విడుదలవుతున్న లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్



అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

# రాజమౌళికి అరుదైన గౌరవం

### వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు



తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినీమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.

# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

### కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో



నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్-ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.



# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

### నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.



# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టం్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**